# వరకట్నమా వర్ధిల్లు!

గంటా బలరామ్

"గురూ!"

"ఊఁ..." సముద్రం ఆకాశాన్ని చుంబించే చోట పరికిస్తూ.

"నీ కో విషయం చాలా రోజుల్నై చెప్పాలనుకుంటున్నాను."

"అనుకోవడమేగా!"

"లేదు—చెప్పాలనే ఇంతవరకు తీసుకు వచ్చాను."

మూడు నిమిషాల మౌనం.

"చెప్పు! ఏం? ఇప్పుడూ, ఇంకా చెప్పాలనే అనుకుంటున్నావా?" మౌన భంగం.

"ఇది చాలా సీరియస్ మాటర్, గురూ!" సీరియస్‌నెస్ ప్రవేశం.

"ముందు చెపితేగా ఏమైనా తెలిసేది?"

"నేనూ ... నేనూ ... ప్రేమించాను, గురూ!" సీరియస్‌నెస్ నిష్క్రమణం, సిగ్గు ప్రవేశం (అంతకన్నా అరిగి పోయిన రికార్డు ఇంకేమీ లేదు ఈ ధరిత్రిలో).

"మంచి పని చేశావ్! ఆ ప్రేమ స్వరూప మేమిటో ఎవరికీ తెలియదు.



కాని, అందరూ దాన్ని తెరగా చేసుకుని జీవిస్తుంటారు. అసలా వదాన్ని జీవితంలో ఎప్పుడో ఒకసారి ఉపయోగించనివాడు ఎమ్ప్టీనెస్, వ్యానిటీ ( వానిటీ ) లేని వాడిలా పిలవబడతాడు. అందులో ఈ ఏజ్‌లో అది తప్పనిసరి. ఇలాంటి విషయాలు సముద్రం, సెరా, బీచి, పొలాలు, కొండలు, గట్లు, పుట్టలు—వీటి దగ్గరే చెప్పాలి గాబోలు. దేనికైనా ఒక స్థలము, సమయము, సందర్భము అన్నట్లు రూలు ప్రకారం చెప్పావు. ఇంతకీ ఎవర్ని ప్రేమించావోయ్? ఆడవా, మగవా? దేశాన్నా, ప్రజల్నా? డ్రెస్సునా, కల్చర్‌నా? రాయినా, రప్పనా?" ఏకరువు పెట్టటం.

"గురూ! ఆగాగు. నా ప్రేమంటే అంత తేలిగ్గా తీసి పారేస్తున్నావేమిటి?" సిగ్గు విస్ఫురణ. ఎండకి మాడిన బలా ముఖం వేలాట్టం.

"ఏం? తేలిగ్గా తీసి పారేయడమేమిటి? ప్రేమ ఏ ఒక్కడానికీ పరిమితం కాదే! ప్రేమకు బరువూ, తేలికా అన్న తేడాలు లేవే! నీ బరువైన ప్రేమను నేను తేలిక చేసేయడమేమిటి? నాన్‌సెన్స్. నా కదంటేనే మంట. అసలు విషయమేదో డైరెక్టుగా ఏడు." ఆశ్చర్యాన్ని, సీరియస్‌నెస్‌ను నటింపు.

సిగ్గు పునఃప్రవేశం. వేలాడిన ముఖాన్ని పైకెత్తుకుంటూ, సిగ్గుతో మెలికలు తిరుగుతూ, సిగ్గుతోనే ముఖాన్ని క్రిందికి దించేస్తూ, "నేనూ... రాధారాణిని ప్రేమించాను, గురూ!" అంటూ ఆటం బ్రద్దలవటం.

"ఏది! ఆ బడిపంతులు కూతుర్నా! నీ ప్రేమకు చాలా తక్కువ ఖరీదు నిర్ణయించావ్. ఎన్నాళ్ళయిందేమిటి?" పెద్ద గుర్తించనట్టుగా ఆశ్చర్యాన్ని తనలోనే దాచుకొంటూ.

"మూడు నెళ్ళైంది." గుటక మింగుడు.

"ఇంతే! అంటే ఇంకా గట్టిపడలేదన్న మాట!" వెటకారం ధ్వనింపు.

"నిజంగానే ప్రేమిస్తున్నాను, గురూ!" కాస్త విస్ఫారంగా.

"నిజంగానా? చంపావ్! అయితే, మీ జీవితంలో ట్రాజెడీ రామందన్న మాట!"

"అదేమిటి, గురూ! శుభమా అని నీకు చెబితే ఇలా అంటావ్?" విస్ఫారంగానే.

"ఏమిటన్నాను? నిజాన్ని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాను. మరి నిజంగా ప్రేమించానంటున్నావ్. నిజంగా ప్రేమించుకున్న వాళ్ళ హాపీ ఎండింగ్ ఎక్కడైనా చూశావా? విన్నావా? చదివావా? ఒక్క తెలుగు సినిమాల్లో, నవల్లో తప్ప. నే వన్నదాంట్లో అసందర్భమేమీ లేదే! ఇంతకీ ఒన్‌సైడెడ్ లవ్ స్టోరీ చెప్పావు. ఆ పిల్ల నిన్నేమైనా ప్రేమిస్తున్నట్లు కనపడిందా?" క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్న డిఫెన్స్ లాయర్ పోజ్.

"కనపడ్డమేమిటి, గురూ! ప్రేమిస్తుంటేనూ. చాలా సార్లు కలిసి మాట్లాడుకున్నాం. ఉత్తరాలు రాసుకుంటున్నాం. ఊరి చివరనున్న హాలుకి ఒకసారి సినిమాకి కూడా వెళ్ళాం."

"ఇంతే! ఇవే నిజమైన ప్రేమకు నిదర్శనాలా? అఫ్‌కోర్స్, ఇవన్నీ మోడర్న్ పద్ధతులే అనుకో. అయినా, వాళ్ళు చాలా పేదవాళ్ళనుకుంటాను?"

"వాళ్ళు పేదవాళ్ళైతే నాకేమిటి, గురూ! మాకు బోలెడు ఉందిగా!"


"అదే! అక్కడే వచ్చింది చిక్కు. మీకు బోలెడు ఉండడమే ట్రాజెడీకి నాంది. ఏమీ కట్నం ఇవ్వలేని అమ్మాయిని నీకు చేయడానికి మీ వాళ్ళు ఒప్పుకోరుగా!"

"వాళ్ళొప్పుకోవడమేమిటి? చేసుకొంటున్న వాణ్ణి నేనుగాని, వాళ్ళు కాదుగా?"

"చేయబోయేది వాళ్ళేగా?"

"వాళ్ళైతే మాత్రం నా ఇష్టాయిష్టాలతో పనిలేదేమిటి? దట్ టూ! నాకు కట్నాలూ, కానుకలూ తీసుకోవడమంటే పరమ అసహ్యం." శోభన్‌బాబు పోజు.

"తీసుకోకపోవడం మీ వాళ్ళ కసహ్యంగా? బాబ్జీ! ఎందుకొచ్చిన గొడవ. ఆ పిల్ల జీవితాన్ని లత నవల్లా చేసేయకు మీ అంతస్తు వేరు, వాళ్ళ అంతస్తు వేరు. ఆ పిల్లను నీకు చేయడానికి మీవాళ్ళు చస్తే ఒప్పుకోరు." నచ్చచెప్పాలనే ప్రయత్నం.




అదే పోజు కంటిన్యూ చేస్తూ, "గురూ! నా ప్రేమను శంకిస్తున్నావు. నేను అందరిలా ప్రేమించటం లేదు రాధను. గాఢంగా ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకుంటానని ఆమెకు మాట కూడా ఇచ్చాను" అన్నాడు.

"మాటేగా! తీసుకుంటే పోలే? మాట ఇచ్చావని నానా బాధలూ పడి ఆ మాటను నిలుపుకొనే దమ్ము లేక ఆమె జీవితాన్ని నవ్వుల పాలు చేయడం కన్నా, మాట ఇచ్చే ముందు కొద్దిగా ఆలోచించవలసింది. గాఢంగా ప్రేమించానంటున్నావు, మీ పెళ్లికి మీ వాళ్ళు ఇష్టపడకపోతే తెగించి వాళ్లను కాదని ఆమెను పెళ్లాడగలవా?"

"ఏం? ఎందుకు ఆడలేను?"

"అన్నీ ఆటల్లా అనుకుంటున్నావేమో ఆడటానికి — ఇది జీవితం. పూలబాట కాదు ఆడుతూ, పాడుతూ పోవటానికి. పైగా, ప్రస్తుతం నీ పరిస్థితి ఏమిటో నీకు తెలుసా? అందరినీ కాదని ఎలా జీవిస్తారు మీరు?"

"ఎలా ఏమిటి, గురూ! అందరిలానే జాబ్ చేసి." చాలా ధీమాతో కూడిన జవాబు.

"జాబా! నీ ఈ బి. ఎస్‌సి. ఫస్ట్ ఇయర్‌కా! ఈ కాలంలోనా! నీ దేశం సంగతి నీకు తెలియదేమో! పై వాళ్లకు తెలుసు ఇక్కడి అనెంప్లాయ్‌మెంట్ ప్రాబ్లెమ్స్. కుర్రాడివి! అమాత్రం ఉద్రేకం ఉండాలిలే. కానీ, ఇలాంటి విషయాల్లో కాదు."

"ఉద్రేకమేమిటి, గురూ, ఇప్పుడే నే నేమీ పెళ్లి చేసుకోబోవటం లేదు. ఇది కంప్లీట్‌చేసి, జాబ్ చూసుకొని అప్పుడు."

"అంతవరకూ ప్రేమిస్తూ పోతావా? మరేం చేయవా?"

"అంత మీన్‌గా మాట్లాడకు, గురూ! మరేం చేస్తాను? చాలా జాగ్రత్తగా ఉంటాము. రాధ మీద నీ అభిప్రాయమేమిటి, గురూ?" మరలా సిగ్గు వచ్చేసింది చిందులువేస్తూ.

మనసులో — 'నేను మీన్‌గా మాట్లాడుతున్నానా! హార్త్తిరినీ ... పోనీలే! నీ కా మీన్ అయిడియాస్ రాకుండా ఉండాలనే భగవంతుని కోరుకొంటున్నాను.'

"నా అభిప్రాయమెందుకూ? చేసుకోబోయేది నీవు. అయినా, అడిగావు కాబట్టి నా అభిప్రాయం కాకుండా జనరల్‌గా అందరికీ 'రాధ' మీదుండే అభిప్రాయమిది. అందమైనది. ముఖ్యంగా ఆ కళ్ళు, ముక్కు తీరు మరి, మరి చూడాలనిపించేవి. అహంభావం లేదు. ఆడంబరమూ లేదు. సరళ స్వభావి. కాలేజీ చదువులు చదువుతున్నా, ఆ చదువులకు ఉండవలసిన హొందాయే గాని, కాలేజీ వాళ్లకు ఉండవలసిన వనుకున్న తళుకు బెళుకులు, హంగామా లేవు. రాధ నీ భార్య అయితే నీ వదృష్టవంతుడివే!

"కానీ, ఒక్క విషయం. ఆ పిల్లకన్యాయం చేయకు. నీ మాట నిలుపుకోలేవనే అనుమానం ఏమాత్రమున్నా ఇప్పుడే తప్పుకో. ఇప్పటికేం మించిపోలేదు. తనకి తగిన వాడు తనకి దొరక్కపోడు. హాయిగా మీ వాళ్ళు తెచ్చిన అమ్మాయిని పెళ్లాడు, ప్రేమించు. అందరికీ ఆనందం. ప్రేమా, దోమా అవి ఇప్పుడు మాత్రం పట్టుకు వేలాడకు. ఇంక ఇలాంటి పెళ్లిళ్ళు తప్పించటానికి పెద్దవాళ్ళు ఎంతటి అసహ్య మార్గాలు తొక్కడానికైనా వెనకాడరు. మీలాంటి వాళ్ళు వాటిలోకి ఉడ్చబడ్డం పెద్ద వింతేమీ కాదు, క్రొత్త కాదు." నచ్చచెప్పాలనే ప్రయత్నం.

"లేదు, గురూ! నా సంగతి నీకు తెలియదూ? నీకైనా నా మీద నమ్మకం లేదా?" శంకించినందుకు చిన్నగా బాధ.

"నీ మీద నమ్మకం లేక కాదు, బాబ్జీ! ఏ విషయంలోనైనా నమ్మవచ్చు గాని, ప్రేమంటున్నావుగా! అందులోనూ వయసుకత్తె మీద, కాబోయే అర్ధాంగిగా, కాముకానుభవం కోరి. అసలు నా కా ప్రేమన్న మాట మీదే నమ్మకం లేదే! ఓ కే! ఆల్ రైట్! మీ ప్రేమ ఫలించాలని, సుఖాంతం కావాలని కోరుకొంటున్నాను."

"థాంక్ యూ వెరీ మచ్! ఒక్క విషయం — మొదట ప్రేమకు చాలా

[illegible] గర యించావని అన్నావు. [illegible] మిటి!"

[illegible] ప్రేమిస్తున్నావు. పెళ్లి కూడా చేసుకోవా [illegible] ప్రేమను, నిన్ను ఎక్కువ ఖరీదుకు కొనుక్కునే తాహతు వాళ్లకు లేదు. గౌరవానికి పాటుపడి, నానా బాధలూ పడి కావ్యగా నీకు చాలా తక్కువ ముట్టచెప్పవచ్చు. ఆ ఉద్దేశంతో అన్నాను."

"అబ్బా! ఎక్కడి కెక్కడ వేశావ్, గురూ!" ఆశ్చర్య మిళితమైన చిర్నవ్వు.

"లే! మరింక వెళదాం, పనుంది."

ఇళ్లకు బయలుదేరటం. సాయంత్ర సమయం, బీచిలో కోలాహలం.

● ● ●

రామానుజం రవిశంకర్‌కు గురువు, స్నేహితుడు. వయసు తేడా పది సంవత్సరాలు. రామానుజం ఒక కంపెనీలో అక్కౌంటెంట్. పెళ్లైంది, రెండేండ్ల కూతురుంది. వయసుకు, పదవికీ, అంతస్తుకు, కులానికి కాక, మనిషికీ, మనసుకు, మంచికి విలువ ఇచ్చే మనిషి. నిజాన్ని కక్కటంలో నిర్మొహమాటస్థుడు. ఉద్యోగరీత్యా విశాఖ వచ్చి రవిశంకర్ వాళ్లింట్లోనే అద్దెకు దిగాడు.

రవిశంకర్ కలవారి బిడ్డ. వాళ్ల నాన్నగారికి ఆ ఊళ్లో ఒక పెద్ద బట్టలషాపూ, వాళ్లున్న మేడ కాక, అద్దెకిచ్చిన రెండు పెద్ద పెంకుటి ళ్లున్నాయి. మరి రెండు బట్టల షాపుల్లో షేర్లు ఉన్నాయి. రవిశంకర్ తరవాత పన్నెండేళ్ల పాప, పదేళ్ల బాబూ ఉన్నారు, అంటే. ఇంటి వాళ్లూ, బాగా దగ్గిర వాళ్లూ రవిశంకర్‌ను 'బాబ్జీ' అంటారు.

'బాబ్జీ' లోని సుగుణాలు, నిర్మొహమాటం రామానుజంను దగ్గర చేశాయి. రామానుజం ఇంటెలిజెన్స్, మంచితనం బాబ్జీ మనసులో అతణ్ణి గురువును చేశాయి. అందుకే బాబ్జీ సంతృప్తిగా రామానుజాన్ని 'గురూ!' అని పిలుస్తాడు. రామానుజం—"ఛీ! మోటారు వాళ్లలా అదేమిటి? అలా పిలవ"ద్దని వారించినా, ఫలితం లేకపోగా రాను రాను ఇద్దరూ అందుకు అలవాటు పడిపోయారు.

రాధారాణి పక్క వీథిలో ఉంటున్న ఒక బడిపంతులు రెండవ కూతురు. మొదటి అమ్మాయిని ఎలాగో కష్టపడి ఒక గుమాస్తాకి పెళ్లిచేశాడు పంతులు. రాధ తెలివి తేటలు, శ్రద్ధ అతి కష్టంతో రాధను కాలేజీ చదువులు చదివింప చేస్తున్నాయి. రాధ తరవాత ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. గౌరవానికి లోటు లేని కుటుంబం వారిది. అన్ని విధాల బాబ్జీకి సరిపోయినా, ఒక్క ఆర్థిక విషయంలో మాత్రం అతని ముందు నిలబడటానికి కూడా అర్హత లేనటువంటిది ఈనాటి లోకుల ( కాకుల ) దృష్టిలో.

● ● ●

"గురూ!"

"ఊఁ ..." సముద్రం ఆకాశాన్ని చుంబించే చోట పరికిస్తూ.

"ఏమైనా మాట్లాడు!" మాట్లాడించాలనే దుగ్ధ.

"ఏం మాట్లాడేది?" ఏన్నో ఉన్నా, ఏమీ లేనట్లు.

"రాధతో నా పెళ్లి ఎందుకు జరగలేదని అడగవేం?"

"చెప్పాలనుకుంటే నీవే చెబుతావుగా! అయిదు సంవత్సరాల తరవాత కలిశాం. ఈ వయసులో నాకేం పెద్ద అనుభవాలుండవు. ఉన్నా చెప్పుకోవలసినవి కావు. నీ జీవితంలో ఇలాంటి వేవో తప్పక ఉంటాయి. అవి ఎవరికో ఒకరికి చెప్పాలి. నాకే చెప్పచ్చుగా!" వినాలనే ఆరాటాన్ని వెలుగుపరచక, చెప్పి తీరాలనే ఒక విసుగు.

"రాధను నేను మోసం చేయలేదు, గురూ! తన పవిత్రతకి ఎలాంటి భంగం రానీయలేదు. నన్ను నమ్ము, గురూ!" దీనాలాపన.

"బాబ్జీ! ఏ విషయంలోనైనా మన ఆత్మసాక్షి మనకు ఉండాలి. ఇతరుల నమ్మకాలు, అపనమ్మకాలు మన కనవసరం. రాధను నీవు మోసం చేసేసి ఉండకపోవచ్చు. ఇంక పవిత్రత అంటావా? నీ వనుకున్నట్లు అది శరీరానికే కాదు, ముఖ్యంగా మనసుకు సంబంధించినది. అది కలుషిత మయేది మీా రనుకుంటున్న ఇలాంటి ప్రేమా, దోమలతోనే. అది సరే అసలు సంగతి చెప్పు."

"నేను ఫైనల్ ఇయర్ చదువుతున్నప్పుడు మీా రిక్కడికి వచ్చేశారు కదూ? మా రిజల్ట్స్ తెలిశాయి. నేను బి. ఎస్‌సి. ఫస్టు క్లాసులో, రాధ బి. ఎ. సెకండ్ క్లాసులో పాసయాం. మా సంతోషానికి అవధులు లేకపోయాయి. ఒకనాటి రాత్రి భోజనం చేస్తున్నప్పుడు అమ్మ చెప్పిన మాట నన్ను పాతాళానికి క్రుంగవేసింది. సుబ్బారావుగారి కుమార్తెతో నా పెళ్లి నిశ్చయం చేశారట. ఆమె రాధ వాళ్ల క్లాసే. బి. ఎ. థర్డు క్లాసులో పాసయింది. రాధ అంత అందంగా లేకపోయినా, బాగుంటుంది. అయినా ప్రేమ ఒకరితో, పెళ్లి ఒకరితో. నా ఆత్మ నేను బ్రతికి ఉండగా ఈ పెళ్లి జరగదని ఘోషించింది. అదే అమ్మతో చెప్పాను. మొదటి నుండి అప్పటివరకు నాకూ, రాధకూ మధ్య జరిగిన వ్యవహారమంతా చెప్పాను. ఏ శక్తి మా పెళ్లికంతరాయం కలిగించలేదని కూడా చెప్పాను. తరవాత అమ్మ చెప్పినది విని పిచ్చెక్కి పోయాను. ఒక పక్క మనసారా ప్రేమించిన ప్రేయసి, వేరొక పక్క కన్న తలిదండ్రులు, తోడబుట్టినవాళ్లు. మా ఆస్తిమీాద, ఇళ్ల మీాద చాలా అప్పు ఉందట. అవి అన్నీ తీరిస్తే ఆ రెండు పెంకుటిళ్లే మాకు మిగులుతాయట. వాటిలో ఒకదానిలో మేముంటూ, రెండవ దానిమీాద వచ్చే కిరాయితో, దొరికితే నేను ఉద్యోగం చేసి సంపాదించే జీతంతో జీవించవలసి ఉంటుందట. నమ్మ శక్యం కాలేదు. అదే అన్నాను అమ్మతో. తరవాత అమ్మ ఏడుస్తూ చెప్పిన విషయాలన్నీ నమ్మవలసి వచ్చింది.

"సుబ్బారావుగారి కుమార్తెనే చేసుకోవటానికి కారణం అడిగాను. ఆయన ఏభైవేల రొక్కం కట్నంగా ఇస్తూ, నన్ను ఎమ్. ఎస్‌సి. చదివించి ఉద్యోగం కూడా చూపెడతాడట. మనసు కకావికలమైంది. భోజనం నుండి లేచిపోయాను.

"తరవాత నేను పెళ్లికి సమ్మతించే వరకు అమ్మ, నాన్నల దీన దృక్కులు నన్నన్నిచోట్లా, అన్ని వేళలా వెంటాడేవి. నాన్నగారు నాతో మాట్లాడటమే మానేశారు మునపటిలా. తను చెప్పవలసినదేదో అమ్మద్వారా చెప్పించేశారు.

"ఆ పరిస్థితులలో రాధను రెండు మూడు సార్లు కలిశాను. విషయం మాత్రం తనకి చెప్పలేదు. నేను తనతో మునపటిలా ఉండలేదని, కారణం చెప్పమని విస్మారంతో నన్ను వేధించింది. అన్నీ ఆలోచించి ఒక సారి తనతో జరిగిన దంతా చెప్పాను. తను విరాగినిలా నవ్వి అప్పటి మా పరిస్థితులలో అమ్మా, నాన్నల కోర్కె తీర్చి మా కుటుంబాన్ని ఆదుకోవటమే నా ప్రథమ తక్షణ కర్తవ్యమని చెప్పింది." ఆగి చిన్నగా నిశ్వసన. ఆమె చెప్పిన ప్రకారమే తను చేసినట్లు, తన తప్పేమీా లేదనే సమర్థనాభావం పొడచూపినట్లుగా.

సముద్రం మీాద నుండి దృష్టిని మరల్చక, "ఏమని హితబోధ చేసిందేమిటి?" అన్నాడు.

"ప్రేమకు త్యాగమే అంతిమ ఆశయమని, ఇంటికి పెద్దవాడుగా తల్లి తండ్రులను, తోడబుట్టిన వాళ్లని అంతటి క్లిష్ట పరిస్థితిలో విడవడం నా బాధ్యతకు విరుద్ధమని, విడిస్తే అంతవరకు హై స్టేటస్‌లో జీవిస్తున్న మా



నిరీక్షణ

—కె. వి. రావు (మద్రాసు-54)



## శ్రీమతి చెరుకూరి రమాదేవి రచించిన ఈ నవల సంక్రాంతి ప్రత్యేక సంచికలో ప్రారంభం

కుటుంబం ఒక్కసారి ఆ దారిద్ర్యాన్ని తట్టుకోలేక ఊహించని అగచాట్లకు గురవుతుందని, మా సన్నిహితత్వం శ్రుతిమించలేదు కనక ఒకరి మంచికై విడిపోవటం అంత బాధాకరం కాదని, తను కూడా ఉద్యోగం చేసి కొన్నాళ్ళ తన వాళ్ళని చూడాలనుకుంటున్నానని, తనకి తగినవాడు తనకి దొరక్క పోతాడా అని, ఇంకా ఎన్నెన్నో చెప్పింది. ఒక విధంగా నన్ను విమలను ( సుబ్బారావుగారి కుమార్తెను ) చేసుకోమని బలవంతం చేసింది. విమల తరఫున వచ్చి తనే అంతా అయి, మా పెళ్లి జరిపించింది.

"ఇప్పుడు చిన్న బట్టల షాపూ, మే ముంటున్న మేడా మాకు ఉన్నాయి. మామగారి వల్లనే నేను ఎమ్. ఎస్సి. చేసి, ఫెర్టిలైజర్స్‌లో పనిచేస్తున్నాను. రెండు సంవత్సరా లవచ్చింది." చివరి మాటల్లో ముందున్న వ్యథా, జీరా లేవు. ఏదో మామూలు విషయంలా సాగిపోయింది. మామగారిమీద కావలసినంత కృతజ్ఞతా భావం కూడా ఉంది.

'నాకు తెలుసు, రాధ లాంటి మనిషి ఆ పరిస్థితులలో అలాంటి సలహాయే ఇచ్చి ప్రేమను పవిత్రం చేస్తుంది. ప్రేమ అనే పదార్థం మీలాంటి వాళ్లం దరి దగ్గరా అపవిత్రమై, పుష్కరాని కోసారి పవిత్రత కొరకై పరుగులెట్టి పరమ పాపిలా రాధ లాంటి వాళ్లను ఆశ్రయిస్తుంది పవిత్రతకోసం. నీకు రాధమీ దున్న ప్రేమ ఎలాంటిదో నేను చెప్పను. కానీ, దారిద్ర్యానికి భయపడే గుణం నీలో ఉంది. అదే నీచే విమలకు తాళి కట్టించింది. ఇతరులకోసం త్యాగం చేసే ధైర్యం నీకు లేదు. నీకోసం ఇతరులను బలి తీసుకొనే తెగువమాత్రం ఉంది. నిజమైన ప్రేమకు నికృష్టమైన జీవితమే రాసి ఉందేమో?' అని తనలో తా ననుకొంటూ—"గురూ!మాట్లాడవేం?" అన్న పిలుపుతో బాహ్య ప్రపంచానికి వచ్చి, "ఏం మాట్లాడేది? ఏది జరిగినా మంచే జరిగిం దనుకోవాలి. అప్పటి పరిస్థితులలో అదంతే.లే! ఇంక వెళదాం" అన్నాడు. లేచి ఇసుక దులుపుకొని మెల్లగా నడుస్తుండగా — "గురూ! అప్పుడు ప్రేమా, పెళ్లి అని, అన్ని పెద్ద పెద్ద మాటలు చెప్పి, బాసలు చేసి ఇప్పు డిలా చేసిన నా మీద నీ కసహ్యంగా లేదూ?" అంటూ ఏదో తెలుసుకొని తృప్తిపడాలనే తపన.

మనసులోని సంఘర్షణను బయటకు కనపరచనీయక సాధ్యమైనంత కాజువల్‌గానే — "నాకేం లేదు. మీ ఇద్దరి కోరిక సఫలం కావాలని కోరుకొంటూనే, అంతస్తుల అంతర్యాలు గుర్తుకు వచ్చి నప్పుడల్లా ఏమవుతుందో ననే శంక నన్ను పీకేది. కానీ, నే ననుకొన్నది కారణం కాక, నే నూహించలేనిది కారణమైంది మీ ఎడబాటుకు. అదే నా బాధ."

"ఏమిటి, గురూ, అది?"

"ఏం లేదు. మీకున్న డబ్బే మీ కలయికకు పెద్ద అడ్డంకి అనుకున్నాను. కానీ, అది లేకపోవడమే కారణమైనట్లుంది. ఇది నేను తెలుసుకొన్న కొత్త విజం ఈ ఏకాంతాలూ ఇవీ ఈయటం, పుచ్చుకోవటం మంచిదేమో ననిపిస్తుంది. ఇప్పుడు రాధేం చేస్తుంది?"

"భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెస్సెల్స్‌లో స్టెనోగా పనిచేస్తోంది."

"బస్సు వస్తుంది, ఆగు! బస్సులో పోదాం."

సమయం సూర్యాస్తమయం. బొంబాయి మెరైన్ డ్రైవ్ బీచ్ రోడ్డులోని బస్సు స్టాప్. అంతా కోలాహలం.

ఇప్పటికి అయిదు సంవత్సరాల క్రితం రామానుజానికి ప్రమోషన్ మీద బొంబాయి ట్రాన్స్‌ఫరైంది. ఇప్పుడు తను పెద్ద కంపెనీలో అసిస్టెంట్ అక్కౌంట్స్ మానేజర్. సిన్సియర్ భారతీయ పౌరుడు గనక ముచ్చటైన ముగ్గురు బిడ్డల తండ్రి. ప్రస్తుత సంఘం దృష్ట్యా రెండు ప్లస్‌లూ, ఓ మైనస్.

కుటుంబంలోని ఆర్థిక ఇక్కట్ల వలన, పేదరికమంటే భయం వలన, విధి వినోదంకోసం, డబ్బుకోసం ప్రేమను త్యాగంచేసి రవిశంకర్ ( బాబ్జీ ) విశాఖలోని అక్కాధికారి సుబ్బారావు కుమార్తె విమల బి. ఎ. కి భర్త అయి, మామగారి కటాక్ష వీక్షణాల వెలుగులో ఎమ్.ఎస్‌సి. అయి, విశాఖలోనే ఫెర్టిలైజర్ ఫాక్టరీలో బుల్లి ఆఫీసరై, మూడు సంవత్సరాల ప్లస్‌కు తండ్రి అయి, ఆఫీసు పని మీద బొంబాయి వచ్చి, గురువుగారైన రామానుజం ఇంట బస చేశాడు.

ప్రేమకి అర్థం రామానుజానికి తెలిసినదేదో తెలిపిన నేరానికి, ప్రస్తుతానికి ఉద్యోగం చేస్తూ తన తల్లితండ్రులను, తోబుట్టువులను పోషించటమే పరమావధిగా జీవితం నెట్టుకొస్తుంది రిటైర్డ్ ఎలిమెంటరీ స్కూల్ టీచర్ కుమార్తె కుమారి రాధారాణి, బి. ఎ. ★